క్లుప్తంగా

మహాసభలు జయప్రదం చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్: ఆశా వర్కర్స్ యూనియన్ మూడవ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 30 ,31 తేదీలలో కడపలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ .వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం రాష్ట్ర మహాసభలు జయప్రదాన్ని ఆకాంక్షిస్తూ ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. ఈ మేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించాలని కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, ఆఫీస్ బేరర్లు చాముండేశ్వరి, నాగవేణి, వేదవతి, ఏఐటీయూసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, ఎల్. నాగ సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎం.గంగాధర్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కే.సి. బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

డీడీ శ్రీనివాసులును సస్పెండ్ చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్: నగరంలో రిమ్స్‌లో పనిచేస్తున్న అప్కాస్ కార్మికులలో నచ్చిన వారికి ఒక రకంగా.. నచ్చని వారితో మరో రకంగా వ్యవహరిస్తున్న డీడీ శ్రీనివాస్ రావును సస్పెండ్ చేయాలని గురువారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, అధ్యక్షులు చంద్రారెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్ రంగ స్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీడీ శ్రీనివాసులు అక్రమాలకు పాల్పడు తున్నా రని ఆరోపించారు. ఇందుకు నిదర్శనం, ఇటీవల ఒక ఉద్యోగి అనాథరైజేషన్ గా విధులకు రాక పోయిన రెండు నెలల జీతం చేసిన చరిత్ర డీడీ దే నని తెలిపారు. ఆయనపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ రుణాల దరఖాస్తుకు గడువు పెంచాలి

కడప రూరల్ : జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ వర్గాలకు అందించే సబ్సిడీ రుణాల దరఖాస్తుకు గడువు పెంచాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ కె శంకర్ తెలిపారు. గురువారం స్థానిక ఆ శాఖ జిల్లా కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి రాజ్యలక్ష్మి కి వినతి పత్రం సమర్పించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ 2025–2026 ఆర్థిక సంవత్సరానికి అందించే రుణాల ఆన్ లైన్ దరఖాస్తు గడువును పెంచాలన్నారు. ఈనెల 10వ తేదీతో దరఖాస్తు చేయడానికి గడువు ముగుస్తుందని తెలిపారు. పలుమార్లు సర్వర్ అంతరాయం వలన చాలామంది అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. అందువలన దరఖాస్తు గడువును పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలో లేవాకు ట్రస్టు ఆధ్వర్యంలో వేసవిలో వంద రోజుల పాటు ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం అని కడప నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి అన్నారు. గురువారం కడప నగరంలో లేవాకు నారపురెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా వేసవిలో నగరంలోని ముఖ్య కూడళ్లలో 23 చలివేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వహించడం గొప్పపని అన్నారు. లేవాకు నారపురెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ లేవాకు లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ట్రస్టు తరుపున చలివేంద్రాలు, ట్యాంకర్లు, పేదలకు వడ్లు పంపిణీ, పశువులకు పశుగ్రాసం పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్స్ లేవాకు నితీష్‌రెడ్డి, లేవాకు రఘునాథరెడ్డి, సభ్యులు రాజారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సరేంద్ర, శివ, మాధవి, భారతి, సబీహ, ప్రభాకర్ పాల్గొన్నారు.

అరియర్స్ అందేలా చర్యలు చేపట్టాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీజీబీలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు అరియర్స్ అందేలా చర్యలు చేపట్టాలని బీఎంఎస్ ఏపీ యూనిట్ ఉపాధ్యక్షుడు జి.వెంగళరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు న్యాయపరంగా రావలసిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, అరియర్స్‌ను, తర్వాత పదినెలలు పెరిగిన ఎన్‌క్యాష్‌మెంట్ అరియర్స్ ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ఇప్పటికే సప్తగిరి గ్రామీణ బ్యాంకు యాజమాన్యం మూడు నెలల మునుపే చెల్లించిందని, మాకు రావలసిన అరియర్స్ ఇప్పించాలని కోరారు.



జీవన ఛత్రం

మండుటెండలు 43 డిగ్రీలు దాటుతున్న వేళ చిరు వ్యాపారులకు గొడుగులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటిని ఆసరా చేసుకొని వాటి నీడలో పండ్ల వ్యాపారులు తమ వ్యాపారాలను సాగిస్తున్నారు. అలాగే కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రతి సోమవారం లేఖరులు కూడా మండు టెండలో గొడుగుల నీడలో కూర్చొని అర్జీలు రాసే పనిలో నిమగ్నమయ్యారు.

– ఫోటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప



ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లో ఉన్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం కడపలోని ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఒక అపార్టుమెంట్‌లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల నిర్వహిస్తూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. వేలకు వేలు ఫీజులు గుంజుతూ పిల్లలకు కనీస మౌలిక వసతులను కూడా కల్పించడం లేదని ఆరోపించారు. దీంతోపాటు కళాశాల ఎంట్రెన్స్‌లోనే పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం వలన విద్యార్థులకు అపాయం ఉందన్నారు. ఆ కళాశాల భవనంలోనే పెద్ద పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉండడంతో విద్యార్థులకు కళాశాలలోకి ప్రవేశించేటప్పుడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయమై ఆర్ఐఓకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు గురు. సందీప్. మన్సూర్. కిరణ్. ప్రవీణ్. వంశీ. సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి మాచుపల్లె రేణుకా యల్లమాంబ తిరునాల

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన జగజ్జనని శ్రీ రేణుకా యల్లమాంబ తిరునాల ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరుగునని గ్రామ పెద్దలు బుధవారం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన తెల్లవారుజామున అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగునన్నారు. 13న రాత్రి అమ్మవారి ఊరేగింపు, అనంతరం ఆర్కెస్ట్రా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ రేణుకా యల్లమ్మ కల్యాణోత్సవం, కోలాట భజనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం సింహ వాహనంపై ఊరేగింపు, అమ్మవారి కథ ఉంటుందన్నారు. తరువాత పాటల కచేరి ఉంటుందన్నారు. 15వ తేదీ అమ్మవారికి బోనాలు సమర్పణ, కోలాటం, ఊరేగింపు ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు వృషభ రాజములచే బండలాగుడు పోటీలు జరుగునన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన యడ్ల యజమానులకు మొదటి బహుమతి రూ.1,00,116, రెండవ బహుమతి రూ.70,116, మూడవ బహుమతి రూ.50,116, నాల్గవ బహుమతి రూ.30,116, ఐదవ బహుమతి రూ. 20,116లు అందజేస్తామన్నారు. రాత్రి శేష వాహనంపై అమ్మవారి ఊరేగింపు, చెక్క భజనలు, పండరి భజనలు జరుగుతాయన్నారు. 16వ తేదీన ఉదయం అమ్మవారి ఊరేగింపు, వసంతోత్సవం ఉంటుందన్నారు. కావున భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని గ్రామ పెద్దలు కోరారు. ప్రతి రోజు కడప రాజా జ్యువెలర్స్ యజమాని జరుగు రాజశేఖర్‌రెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారని తెలియజేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం

కమలాపురం : మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. గురువారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలించుటలో భాగంగా పట్టణంలోని షాదిఖాన దగ్గర, సుంకులమ్మ ఆలయం దగ్గర, మార్కెట్ యార్డు గ్రౌండ్, పాగేరు వంతెన వద్దనున్న ధోబి ఘాట్ తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గంజాయి తాగడం వలన కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించారు. అలాగే మట్కా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఎక్కడ ఇలాంటి కార్యక్రమాలు జరిగినా తక్షణం పోలీసులకు సమచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న రామాపురం

కమలాపురం : మండలంలోని రామాపురం క్షేత్రం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ భూమిలో ఎక్కడాలేని విధంగా హరిహర దేవతామూర్తులు శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్షనారాయణస్వామి, శ్రీవల్లి దేవసేన సమేత ద్వికందర షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వెలసిన రామాపురంక్షేత్రంలో ఈనెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ప్రధాన సేవకుడు సత్యసాయినాథశర్మ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ ఆలయంలో ప్రతి ఏటా వైశాఖ శుక్ల త్రయోదశి నుంచి వైశాఖ బహుళ విదియ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. గురువారం ఆలయ సేవకులు చేస్తున్న ఏర్పాట్లను సత్య సాయినాథ శర్మ పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

విద్యార్థులు విద్యావేత్తలుగా ఎదగాలి


దూదేకుల విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న దూదేకుల సంఘీయులు

కడప కార్పొరేషన్: దూదేకుల విద్యార్థులు విద్య, వైద్య, వైజ్ఞానిక రంగాల్లో రాణించాలని ప్రొద్దుటూరుకు చెందిన గౌతమి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ సి. నాగూర్, రిటైర్డు ఫారెస్ట్ కన్సర్వేటర్ పి. బాషా ఉద్బోధించారు. గురువారం కడప నగరంలోని ఎర్రముక్కపల్లిలోని దూదేకుల భవన్‌లో దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు వి.ఖాదరయ్య, ప్రధాన కార్యదర్శి రిటైర్డు ప్రిన్సిపాల్ పి. మస్తాన్, నజీర్, అజ్మతుల్లాలతో కలిసి నిర్వహించిన అబ్దుల్ కలామ్ మెరిట్ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సి. నాగూర్, పి. బాషా మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఇంటర్, పది ఫలితాల్లో రాణించిన 58 మంది విద్యార్థులు మరింత బాధ్యతగా చదవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దూదేకులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న సంగతిని గమనంలో ఉంచుకుని చదువుల ద్వారా రాణించాలన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు విద్య పట్ల ఆసక్తిని కలిగించే ప్రయత్నం చేయాలన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని గౌతమి ఇంజినీరింగ్ కళాశాలలో దూదేకుల పిల్లలకు ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యను ఉచితంగా అందించే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహబూబ్ బాషా, ఆర్.బాబు, ఫారెస్ట్ రిటైర్డు ఆఫీసర్ హుసేన్, పగడాల దస్తగిరి, పగడాల పెద్దన్న, పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యాయామంతో క్రమశిక్షణ

కడప ఎడ్యుకేషన్: క్రమశిక్షణకు, చక్కటి శరీర సౌష్టవానికి ఎన్.సి.సి డ్రిల్ ఉపయోగపడుతుందని 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్యనారాయణ మూర్తి అన్నారు. తెలుగు గంగ కాలనీలో నిర్వహిస్తున్న ఎన్.సి.సి ఉమ్మడి వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం ఎన్.సి.సి క్యాడెట్లకు రైఫిల్ డ్రిల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కల్నల్ సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సమాజంలో ఉత్తమ పౌరులుగా మెలగడానికి అవసరమైన అన్ని లక్షణాలను క్యాడెట్లు ఈ క్యాంపులో నేర్చుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్.జే. ఆత్రే, ఎన్.సి.సి అధికారులు కెప్టెన్. డాక్టర్. నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్, పరేడ్ శిక్షణ అధికారులు సుబేదార్ మేజర్ అనిల్ కుమార్, రూపేంద్ర జీత్ సింగ్, సీ.ఎల్. రెడ్డి, కొండా రెడ్డి, గర్ల్ క్యాడెట్ ఇన్‌స్ట్రక్టర్ మిశ్రా, ఆఫీస్ సూపరింటెండెంట్ డేవిడ్, ఉమా, మల్లేశ్వరి, శివప్రసాద్, రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ శిబిరంలో డ్రిల్ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

రెడ్‌క్రాస్‌ను బలోపేతం చేద్దాం

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖను అందరం సమన్వయంతో బలోపేతం చేద్దామని రెడ్ క్రాస్ జిల్లా సెక్రెటరీ, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఏ. సురేష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక మట్టి పెద్దపులి సర్కిల్‌లో ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయంలో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రెడ్ క్రాస్ సీనియర్ సభ్యులు జానమద్ది విజయభాస్కర్, శివారెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు తదితరులతో కలిసి రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యునంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఎక్కడో స్విట్జర్లాండ్ దేశంలో పుట్టిన ఆయన ప్రస్తుతం చాలా దేశాల్లో వ్యవస్థను స్థాపించి ఎక్కడ ఏ విపత్తు సంభవించినా మేమున్నామంటూ స్వచ్ఛందంగా సేవలందించే విధంగా సంస్థను నెలకొల్పారన్నారు. రెడ్‌క్రాస్‌కు జిల్లా కలెక్టర్ ప్రెసిడెంట్ గాను, డిస్ట్రిక్ రెవెన్యూ ఆఫీసర్ స్పెషలాఫీసర్ గాను ఉన్నారని, వీరి సహకారంతో మనమందరం కలిసి జిల్లాలో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకొని సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ముఖ్యంగా మొక్కలు నాటడం, ప్రథమ చికిత్స పైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, రక్తదాన శిబిరాలు విరివిగా ఏర్పాటు చేసి పేదలకు అందించడం, ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం, జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ లో విద్యార్థులను భాగస్వామ్యం చేసి వారి ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కోఆర్డినేటర్ కు పలు సూచనలు జారీ చేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు రెడ్ క్రాస్ సభ్యులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ యశస్విని, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సుధాకర్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ స్వరూపారాణి, వైస్ పాట్రన్ జాలా ప్రభాకర్, సభ్యులు జేస్టాది వసంత్, విష్ణువర్ధన్, నాగ మల్లారెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.


రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యునంట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సురేష్‌కుమార్

దేవాలయ స్థలాన్ని పరిరక్షించాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి త్యాగరాజు

కడప కార్పొరేషన్: మాసాపేటలో దేవాలయ స్థలాన్ని ఆక్రమణ దారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ త్యాగరాజు డిమాండ్ చేశారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాసాపేట ఆలయ స్థలం 0.53 సెంట్లు ఉండగా, ఇప్పుడు 0.15 సెంట్లు కూడా లేదన్నారు. వెనుకవైపు ఆక్రమణకు గురైన స్థలంలో కూడా ఆలయం నిర్మిస్తే విశాలంగా తయారవుతుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఆలయ నిర్మాణానికి కడప నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.43లక్షలు మంజూరు చేశారని, అవి సరిపోకపోతే అదనంగా నిధులు మంజూరు చేసేందుకు కూడా మేయర్ సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే గ్రామ ప్రజలు, పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులందరి సమక్షంలో ఆలయ శంకుస్థాపన జరిపించాల్సిన అధికారులు, కాంట్రాక్టర్...ఏకపక్షంగా వ్యవ హరించి....అధికారముందనే అహంకారంతో నిధు లు మంజూరు చేసిన ప్రథమ పౌరుడు మేయర్‌ను, స్థానిక కార్పొరేటర్‌ను ఆహ్వానించకుండా ఎమ్మెల్యే మాధవితో టెంకాయ కొట్టించడం దారుణమన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి కూటమి ప్రభుత్వంగానీ, ఎమ్మెల్యే మాధవిగానీ ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదన్న సత్యాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. ప్రోటోకాల్ పాటించనందునే అధికారులు, కాంట్రాక్టర్‌పై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. 30 ఏళ్ల చరిత్రలో తెలుగుదేశం పార్టీ ఈ గుడికి ఒక్క ఇటుక వేయలేదన్నారు. ఆలయ నిర్మాణం ఆపే ఉద్దేశ్యం మేయర్‌కుగానీ, తమకుగానీ లేదని... అధికారముందని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అన్ని గుడులు ఒకేచోట ఇరుకు ఇరుకుగా చిన్న ఆలయంగా నిర్మించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నా మన్నారు. వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేసి ఉంటే మాసాపేట రోడ్డు ఇంత విశాలంగా తయారయ్యేది కాదన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, సీతారామ దేవస్థాన ఆలయ సెక్రటరీ గున్నా వరహాలు, ఉపాధ్యక్షులు దండు పెంచల నరసింహులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి త్యాగరాజు

భద్రతా చర్యలు తెలిపేందుకే మాక్ డ్రిల్

సిద్దవటం : ప్రమాదాల సమయంలో సిబ్బంది తీసుకోవాల్సిన భద్రతా చర్యలు తెలిపేందుకు మాక్ డ్రిల్ ఎంతగానో ఉపయోగపడుతాయని కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రామక్రిష్టారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని భాకరాపేట వద్ద ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విపత్తుల సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలో సిబ్బందితో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌పీసీఎల్‌లోని ఇథనాల్ గాంట్రీలో ట్రక్ అన్‌లోడింగ్ ముందు టూల్స్ కిట్టు కింద పడటంతో మంటలు చెలరేగాయి. గాంట్రీలో ఉన్న కార్మికుడు ముందుగా డీసీపీని వాడటం జరిగింది. మంటలు ఎక్కువగా చెలరేగడంతో ఫైర్ అని గట్టి కేకలు వేయడంతో అక్కడ ఉన్న హెచ్‌పీసీఎల్ సిబ్బంది ఫైర్ ఎక్కడో చూసుకొని సైరన్ మోగించారు. సిబ్బంది అప్రమత్తమై వాటర్, ఫోమ్ మానిటర్ సహాయంతో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అక్కడ ఉన్న ముగ్గురు వర్కర్‌లకు ప్రమాదం జరగడంతో వారిని స్ట్రెచర్ సాయంతో సిబ్బంది మెడికల్ క్యాంపు వద్దకు తీసుకొచ్చే సన్నివేశాలను మాక్‌డ్రిల్ చేసి చూపించారు. అక్కడ ఉన్న వైద్యుడు శివకుమార్ పరీక్షించి ఒకరికి సీరియస్‌గా ఉండటంతో అతన్ని రిమ్స్ ఆసుపత్రికి తరలించే సన్నివేశాన్ని చేశారు. ఈ సందర్భంగా కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రామక్రిష్టారెడ్డి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిల్లో మంటలను ఎలా ఎదుర్కోవాలో తెలపడం కోసం అత్యవసర మాక్ డ్రిల్‌ను నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డిపో మేనేజర్ సతీష్‌కుమార్, ఆర్ఎం మన్మధరావు, వీడీపిఎల్ డీజీఎం ఓబయ్య, వైద్యుడు డాక్టర్ శివ కుమార్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ సిద్దారెడ్డి, హెచ్‌పీసీఎల్ సిబ్బంది, వీడీపీఎల్ పైప్‌లైన్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రావణబ్రహ్మ వాహనంపై అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తిని రావణబ్రహ్మ వాహనంపై పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. వేకువ జామున అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరిదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, కలశపూజ, మండపారాధన, దీక్షా హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ నట రాజ నాట్య మండలి ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన మోహినీ భస్మాసుర నాటకం అందరిని ఆకట్టుకుంది. రాత్రి గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు విశేష అలంకరణ చేసి రావణబ్రహ్మ వాహనం పై కొలువుదీర్చి శివనామ స్మరణల మధ్య పురవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామ చంద్రాచార్యులు, కమిటీ సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


రావణబ్రహ్మ వాహనంపై గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు

బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: చిన్న వయస్సులోనే వివాహం చేస్తే అనేక అనర్థాలు కలుగుతాయని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. గురువారం కడప నగరంలోని నాగరాజుపేట అర్బన్ హెల్త్ సెంటర్, నాగరాజుపేట–3 అంగన్వాడీ కేంద్రంలో తల్లులు, కౌమర దశ బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, నవజాత శిశు సంక్షరణ పెరుగుదల, అనుబంధ ఆహారం ప్రాముఖ్యతను వివరించారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్, కిశోరి వికాస ట్రెనింగ్ సెంటర్లు, వృత్తి విద్య శిక్షణపై అవగాహన కల్పించారు. డాక్టర్ ముస్కార్, డాక్టర్ సోను సాలెహాలు మాట్లాడుతూ కిశోరి వికాసంపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని, బాలికల్లో వచ్చే సహజమైన మార్పుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియ, అంగన్వాడీ వర్కర్ శ్రీదేవి, హెల్పర్ సువర్చన దేవి, ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్లు షంషాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు

కడప కల్చరల్ : చదువుతోనే బంగారు భవిష్యత్ లభిస్తుందని, విద్యతోపాటు ఆధ్యాత్మికంగా కూడా ఎదగాల్సిన అవసరం ఉందని తాలూకా సీఐ టి.రెడ్డెప్ప అన్నారు. గురువారం స్థానిక న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ సీఐని మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు ఆధ్యాత్మిక పుస్తకాలు, కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ టి.రెడ్డప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతి, సామరస్యాలతో ఒకరి నొకరు ప్రేమానుబంధాలు పంచుకోవాలని సూచించారు. పాస్టర్ మహేష్ అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పి.రవితేజ, అగస్టిన్, శాంతిరాజు, రోజా తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ మాఫియాను అరికట్టాలి

కడప వైఎస్సార్ సర్కిల్: ప్రభుత్వ వైద్యశాలలలో నకిలీ ఉద్యోగులను పసిగట్టి విధుల నుంచి తొలగించాలని, అదే విధంగా ప్రైవేటు ఆసుపత్రుల మెడికల్ మాఫియాని అరికట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాలుగా జిల్లా వైద్యశాఖ అధికారి కార్యాలయంలోనే నకిలీ సర్టిఫికెట్లతో విధులు నిర్వహిస్తున్న సూపర్ వైజర్‌ను నాలుగేళ్లుగా గుర్తించలేకపోవడం బాధాకరమన్నారు. జిల్లా కేంద్రంలో కొన్ని హాస్పిటళ్లలో ల్యాబ్ టెస్టుల్లో ఒక్కో టెస్టుకు ఒక్కో అమౌంట్‌తో బోర్డులు పెట్టి మరీ డబ్బులు డిమాండ్ చేస్తూ పేద ప్రజలను పీల్చుకు తింటున్నారని పేర్కొన్నారు. దీనికి కారణం జిల్లా వైద్య శాఖ అధికారి ప్రైవేటు ఆసుపత్రులపై పర్యవేక్షణ లేకపోవడమే అన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యులు శివతేజ, అరుణ్, నాగార్జున పాల్గొన్నారు.

పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పారు

కడప రూరల్: ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం ఎంతో సంతోషంగా ఉందని జెకె యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పఠాన్ ఖాదర్ బాషా తెలిపారు. గురువారం స్థానిక గౌస్ నగర్ లో ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో జాతీయ జెండాలను చేతపట్టి ఇండియా ఆర్మీ జిందాబాద్ అంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు సలీం, రఫీ, షకీల్, విశ్వనాథ్, అరుణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భారత్ ప్రతీకారం తీర్చుకుంది

కడప వైఎస్సార్ సర్కిల్: పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుందని డీసీసీ ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పహల్గాం దుర్ఘటనలో అమాయకులైన పర్యాటకులను ఉగ్రవాదులు చంపారన్నారు. దీంతో యావత్ దేశం మొత్తం బాధపడిందన్నారు. అలాంటి ఉగ్రవాద సంస్థల స్థావరాలపై మన దేశ సైన్యం దాడి చేసి పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పిందన్నారు.

ముష్కరులను ప్రభుత్వానికి అప్పగించాలి

కడప వైఎస్సార్ సర్కిల్: పెహల్గాంలో పర్యాటకులు, అమాయకులైన భారత పౌరులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులైన ముష్కరులను భారత ప్రభుత్వానికి, పాకిస్తాన్ ప్రభుత్వం వెంటనే అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాద శిక్షణ శిబిరాలను లక్ష్యంగా చేసుకొని భారత త్రివిధ దళాల సైన్యం సమన్వయంతో సమర్థవంతంగా దాడులు చేయటం, భారత సైనికుల యుద్ధ నీతిని, వ్యూహాన్ని, నైపుణ్యాన్ని, ప్రతిభను ప్రదర్శించిందన్నారు. ప్రపంచ దేశాల ప్రశంసలు అందుకునే విధంగా భారత మిలిటరీ ఆపరేషన్ ఉందన్నారు. దేశ సమగ్రతను, ప్రజల సమైక్యతను పరిరక్షించే విధంగా భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చర్యలు ఉంటాయని, కొనసాగాలని ఆశించారు.